క్లుప్తంగా

నేడు సింగరాయకొండలో వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ

సింగరాయకొండ(టంగుటూరు): స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఈనెల 3వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాలు నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ

టంగుటూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం వైఎస్సార్ ఆసరా పథకం 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఆసరా పథకం లబ్ధిదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

వైఎస్సార్ సీపీ మండల సమావేశం రేపు

పామూరు: వైఎస్సార్ సీపీ మండల సమావేశం స్థానిక అనిల్ గార్డెన్స్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి తెలిపారు. సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

అందుబాటులో ఫ్రూట్ కవర్లు

ఉలవపాడు: మామిడి రైతులకు ఫ్రూట్ కవర్లు ఉలవపాడులో అందుబాటులో ఉన్నాయని రైతు స్ఫూర్తి ఫార్మర్స్ అసోసియేషన్ సీఈఓ బాలచంద్ర శుక్రవారం తెలిపారు. మామిడికాయలకు మంగు, పురుగులు సోకకుండా ఈ కవర్లు కొనుగోలు చేయాలని తెలిపారు. కవర్లు కట్టడానికి కూలీలను కూడా రైతులకు అందజేసి కట్టించి ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంను కలిసిన నాయకులు



ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

టంగుటూరు: నూతన ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర సర్పంచుల సంఘ అధ్యక్షుడు ఆనం సత్యనారాయణరెడ్డి, ఉప్పలపాటి సత్యనారాయణరాజు, నర్రా శ్రీను, కొండపి ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, కసుకుర్తి నవీన్, దుగ్గిరాల పేర్రాజు, బుజ్జి మనోహర్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో రోడ్ల నిర్మాణం



గ్రావెల్ రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న నాయకులు, పీఎస్

పామూరు: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో సీసీ రోడ్లు, మట్టి రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు, ఉపసర్పంచ్ యాదాల సాయి కిరణ్, పంచాయతీ కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డి శుక్రవారం తెలిపారు. స్థానిక విరువూరురోడ్డు, వరవకట్టతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో వేస్తున్న అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను వారు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

సాంకేతికతతో విద్య సులభతరం



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ-2 ఆవుల శ్రీనివాసులు

సింగరాయకొండ(టంగుటూరు): సాంకేతికతతో సులభతరంగా విద్యార్థులు విద్యను అభ్యసించవచ్చని ఎంఈఓ-2 ఆవుల శ్రీనివాసులు పేర్కొన్నారు. సింగరాయకొండ మండలంలోని కలికవాయ ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. వాటిని ఉపయోగించుకుని విద్యను సులభతరంగా ఎలా నేర్చుకోవచ్చో వివరించారు. ప్రధానోపాధ్యాయుడు నిడమానూరి సురేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



చెన్నిపాడులో మందులు అందజేస్తున్న ఎంపీపీ మాధవరావు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ జలజాక్షి

టంగుటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరమని జిల్లా డీపీఓ డాక్టర్ వాణిశ్రీ పేర్కొన్నారు. టంగుటూరు 2వ సచివాలయం పరిధిలో ప్రజలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 345 మందిని పరీక్షించి.. 120 మందికి మందులు పంపిణీ చేశారు. 68 మందికి నేత్ర పరీక్షలు, 15 మందికి ఈసీజీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్లు బాలాజీఅశోక్, ప్రసాద్‌బాబు, సీహెచ్‌ఓ మాతయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జరుగుమల్లి: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని వైద్యాధికారి డాక్టర్ కావ్యశ్రీ పేర్కొన్నారు. మండల పరిధిలోని పాలేటిపాడు సచివాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ కావ్యశ్రీ ప్రారంభించారు. 195 మంది రోగులను పరీక్షించి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య సేవలు ప్రజలకు ఉచితంగా అందుతున్నాయని ఎంపీడీఓ కె.జలజాక్షి పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషలిస్టు డాక్టర్లు ఫిరోజ్, కుమారవర్మ, సిహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఆరోగ్యవంతమైన గ్రామాల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు పేర్కొన్నారు. మండలంలోని చెన్నిపాడు గ్రామంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వచ్చిన ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుత్తి శారమ్మ, ఎంపీడీఓ కల్పన, కార్యదర్శి బేబీ, మాజీ ఎంపీటీసీ వెన్నపూస శ్రీనివాసులరెడ్డి, గుత్తి భాస్కర్, నాలి దత్తుకుమార్, పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పీసీపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జఫన్య

వెలిగండ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని, అందులో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదప్రజలకు ఒక వరం లాంటిదని ఎంపీడీఓ టి.సుకుమార్ అన్నారు. మండలంలోని ఇమ్మడిచెరువు గ్రామ సచివాలయం పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు.

పామూరు: పేదలందరికీ మెరుగైన వైద్యం అందుతోందని ఎంపీడీవో ఊట్ల శ్రీనివాసులు, డాక్టర్ దాసరి హరిబాబు అన్నారు. ఇనిమెర్ల సచివాలయం పరిధిలోని ఎంపీయూపీ పాఠశాలలో శుక్రవారం సర్పంచ్ సిద్దమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. డాక్టర్ విజయ్‌కుమార్, యం.ప్రవీణ, శ్రీహర్ష, వి.నాగరాజు 402 మందికి పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ సిద్దమూర్తి లక్ష్మీనారాయణ రెడ్డి, పీఎస్ డి. ప్రసాద్, హెచ్‌ఈవోలు యస్.బ్రహ్మానందం, పెరుగు మురళి, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.ప్రియాంక, ఆర్.శ్రీదేవి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: డాక్టర్ సందీప్ కొండారెడ్డిపల్లి సచివాలయ పరిధిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశలు, పాల్గొన్నారు.

పీసీపల్లి: ఎంపీపీ అత్యాల జఫన్య రెండో విడత జగన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. అవసరమైతే పెద్ద జబ్బులకు పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేస్తామన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రమణారెడ్డి, డాక్టర్ యశ్రిత, డాక్టర్ మోహన్ రెడ్డి , పంచాయతీ నాయకులు మోహన్ రెడ్డి, రవి, బాల, నర్సిరెడ్డి, బోడె కొండారెడ్డి, కోటిరెడ్డి, తదితరులున్నారు.

లింగసముద్రం: మండలంలోని పెదపవని సచివాలయం-1 పరిదిలో జగనన్న ఆరోగ్యశ్రీ-2 కార్యక్రమం గురువారం నిర్వహించినట్లు పీహెచ్‌సి వైద్యాధికారి డా.రమేష్ తెలిపారు. కంటి వైద్య నిపుణులు మురళీక్రిష్టారెడ్డి 75 మందిని పరీక్షించగా 25 మందికి కళ్ళద్దాల కోసం, ఇద్దరిని ఒంగోలు జీజీహెచ్‌కు, మరొకరిని కందుకూరు ఏరియా వైద్యశాలకు పంపించినట్లు చెప్పారు. ఎంపీడీఓ శేషుబాబు, డా.కళ్యాణ్‌కుమార్, వెంకటసుబ్బయ్య, సీహెచ్‌ఓ జి.శ్రీనివాసులు, సర్పంచ్ మందా మరియమ్మ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



టంగుటూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ వాణిశ్రీ



ఇమ్మడిచెరువులో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ సుకుమార్



పామూరు: మెడిసిన్ కిట్లను అందజేస్తున్న ఎంపీడీవో, సర్పంచ్, డాక్టర్లు



హనుమంతునిపాడు: కొండారెడ్డిపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సందీప్

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు

పామూరు: స్థానిక ఎస్సైగా యం.సైదుబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా దొనకొండ నుంచి సైదుబాబు పామూరు బదిలీకాగా ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న కె.సురేష్ యాదవ్ పదోన్నతిపై సీఐగా గుంటూరు జిల్లాకు వెళ్లారు.



యం. సైదుబాబు, ఎస్సై, పామూరు



ఎం శివ, ఎస్సై, వెలిగండ్ల



నాగేశ్వరరావు, ఎస్సై, టంగుటూరు

ఎస్సై శివ బాధ్యతలు స్వీకరణ

వెలిగండ్ల: స్థానిక ఎస్సైగా ఎం. శివ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన ఒంగోలు వీఆర్‌లో ఉన్నారు. బదిలీల్లో భాగంగా వెలిగండ్లకు కేటాయించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన మహేష్ కుమార్‌ను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు.

టంగుటూరు ఎస్సైగా నాగేశ్వరరావు

టంగుటూరు: టంగుటూరు ఎస్సైగా ఎ.నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు డీసీఆర్బీలో విధులు నిర్వహిస్తున్న ఆయన ఎన్నికల సాధారణ బదిలీల్లో భాగంగా టంగుటూరులో నియమితులయ్యారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రత్యేక బహుమతి

- కైవసం చేసుకున్న బేస్తవారిపేట జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థి



విద్యార్థికి అభినందనలు తెలుపుతున్న ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థి గంగుల శివకౌసిక్ సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రత్యేక బహుమతి సాధించాడు. విజయవాడలో విశ్వేశ్వరయ్య సైన్స్ మ్యూజియం, ఇండియన్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. పలు రాష్ట్రాలకు చెందిన 210 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులు ప్రదర్శించారు. శివకౌసిక్ అతి తక్కువ ఖర్చుతో తయారుచేసిన డ్రైవర్స్ యాంటి స్లీప్ అలారం ప్రాజెక్టు ప్రత్యేక బహుమతికి ఎంపికైంది. సైన్స్ ఉపాధ్యాయురాలు ఎస్‌వీ భారతి, హెచ్‌ఎం ఎంఎస్ శర్మ ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించారు. భారత్ ఎలక్ట్రానిక్ కంపెనీ నుంచి ప్రత్యేక బహుమతిని విద్యార్థి అందుకున్నారు. సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఆర్జేడీ నాగమణి, మ్యూజియం క్యూరెటర్ ఉషా మెహరా చేతులమీదుగా బహుమతి, ప్రసంసపత్రాన్ని అందుకున్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

ముండ్లమూరు: మండలంలోని పోలవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కొణతం వేణుగోపాల్‌రెడ్డి తన కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం రూ.15 వేల విలువైన బీరువాను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రమణారెడ్డి.. వేణుగోపాల్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

సీఐకి సత్కారం

కనిగిరి రూరల్: కనిగిరి సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దాసరి వెంకటేశ్వరరావును శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు స్థానిక సర్కిల్ ఆఫీసులో కలిశారు. సీఐను ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, తమ్మినేని సుజాతరెడ్డి, వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు దేవరాజ్, అబ్రహం లింకన్, ఎస్‌కే ఖాశింసా, దాసరి మురళీ, రామనబోయిన శ్రీను, పార్టీ యూత్ అధ్యక్షుడు డాక్టర్ రసూల్, శ్రీహరిరెడ్డి, సంగన మహేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు నిరంతరం ఉపయోగించాలి

పుల్లలచెరువు: ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లను తప్పని సరిగా ఉపయోగిస్తూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఇందిరాప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో 8,9 తరగతులను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ టెక్నాలజీని ఉపయోగించుకుని విద్యార్థులు పాఠాలను నేర్చుకోవాలన్నారు. ట్యాబ్‌ల్లో మాదిరి పశ్నపత్రాలు తయారు చేసుకోవడంతో పాటు రోజూ విద్యార్థులు ట్యాబ్‌లు ఉపయోగించుకోవాలన్నారు. తెలియని విషయాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఈమె వెంట ప్రిన్స్‌పాల్ లిల్లీప్రకాశ్‌వాణి ఉన్నారు.

నేటి నుంచి శివాలయంలో ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు దుర్గా సమేత భోగేశ్వరస్వామి ఆలయంలో మూడో వార్షికోత్సవంలో భాగంగా మూడు రోజులు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు అర్చకులు మేడవరం రాఘవేంద్ర శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం గణపతి పూజ, అభిషేకం, హోమం, ఆదివారం ఉదయం చండీయాగం, అభిషేకం, హోమం, సాయంత్రం శివస్వాములు మెట్ల పూజ, భజన కార్యక్రమం, సోమవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమం, సాయంత్రం చిన్నారులచే కోలాటం, స్వామి వారి కళ్యాణం, మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

మాలకొండ వేలంపాటఆదాయం రూ.4,60,000



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసి ఉన్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహిచిన బహిరంగ వేలంపాటలో రూ.4,60,000 ఆలయ ఈఓ కేబీ శ్రీనివాసరావు తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ నాలుగు షాపులపై ఈ సంవత్సరం వేలంపాట ద్వారా దేవస్థానానికి రూ.4,60,000 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. వాయిదా పడిన 7 ఐటమ్‌లకు ఈ నెల 16న తిరిగి వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు. ప్రత్యేక పర్యవేక్షణ వై. భైరాగి అధ్యక్షతన నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కనిగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డుల్లో చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావుతో కలిసి శుక్రవారం పర్యటించారు. సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు మన్సూర్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేడ్ సచివాలయ ప్రారంభం కోసం మంత్రికి ఆహ్వానం



మంత్రి సురేష్‌ను ఆహ్వానిస్తున్న అనంతవరం గ్రామస్తులు

టంగుటూరు: మండలంలోని అనంతవరం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ సచివాలయ భవనాల కాంప్లెక్స్‌ను ఫిబ్రవరి 11వ తేదీన ప్రారంభించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్‌కు అనంతవరం సర్పంచి ఉప్పలపాటి శివరామరాజు శుక్రవారం కొండపిలో ఆహ్వానించారు. ఎంపీటీసీ కసుకుర్తి కోటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉప్పలపాటి సుబ్బరాజు, సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు, మర్రి భాస్కర్, జిల్లా చంద్ర, శారీమందిర్ వెంకటేశ్వర్లు, మెండా శ్రీను, రాజు వేణు, కన్నా వెంకట్రావు తదితరులు ఉన్నారు.

ఆంధ్రకేసరికి ఘన నివాళి



ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: ప్రకాశం జిల్లా 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర కేసరి సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక కోవూరు రోడ్డులోని ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రకాశం పంతులు పేరుపై 1970లో ప్రకాశం జిల్లా ఏర్పడిందన్నారు. బ్రిటిష్ వారి తుపాకీకి తన గుండెను చూపి ధైర్యం పోరాడిన ధైర్యశాలి ప్రకాశం పంతులు అని కొనియాడారు. ఆంధ్రకేసరి సేవా సమితి అధ్యక్షుడు మంచిరాజు మురళీమోహన్, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చెక్కా వెంకట కేశవరావు, జనార్దన స్వామి ఆలయ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, ఆర్.వెంకటేశ్వర్లు, కాకర్ల రాజగోపాల్‌రావు, ఏవీరావు, చలంచర్ల సుబ్బారావు, బీవీఎల్ఎన్ మూర్తి, ఇస్కాల మధుసూదన్‌రావు, జిల్లెల మూడి వెంకటేశ్వర్లు, కందుకూరు శ్రీనివాస దీక్షితులు, రామచంద్రుని మల్లయ్య, మన్నేపల్లి ప్రసాద్, గుడ్లూరు వెంకటేశ్వరరావు, గాదిరాజు నాగరాజు, ఘట్టమనేని హరిబాబు, ముప్పల భూషయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన 'పాపేశం'



పాపేశం పంతులు దంపతులను సన్మానిస్తున్న డిప్యూటీ ఈవో, ఎంఈవోలు, ఉపాధ్యాయులు

సీఎస్‌పురం (పామూరు): పాఠశాల అభివృద్ధికి కృషి చేయడంతోపాటు ఎందరో విద్యార్థులను భావి భారత పౌరులుగా, ఉన్న ఉద్యోగాలను అధిరోహించేలా చేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన వ్యక్తి పాపేశం పంతులు అని డిప్యూటీ ఈవో ఎ.చంద్రమౌళీశ్వర్ అన్నారు. అరివేముల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణచేసిన పాపేశం పంతులు దంపతులను శుక్రవారం పాఠశాలలో సన్మానించారు. డిప్యూటీ ఈవో ఎ.చంద్రమౌళీశ్వర్, ఎంఈవోలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి మాట్లాడారు. సర్పంచ్ సన్నపురెడ్డి రాధా రుక్మిణమ్మ, పొన్నలూరు ఎంఈవో హరిబాబు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పాఠశాలలోని సహచర ఉపాధ్యాయులు, పీఎంసీ చైర్మన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు నూతన ఎంపీడీఓలు



గుడ్లూరు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తునన్న సుబ్బారావు

గుడ్లూరు: మండల అభివృద్ధి అధికారిగా ఏవీ సుబ్బారావు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖరరావు జలదంకి మండలానికి బదిలీ కాగా బోగోలు బిట్రగుంట ఎంపీడీఓ పని చేస్తున్న సుబ్బారావును గుడ్లూరుకు బదిలి చేశారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు.



జి.క్రిష్టయ్య, ఎంపీడీవో, సీఎస్‌పురం

ఎంపీడీవోగా క్రిష్టయ్య

సీఎస్‌పురం (పామూరు): సీఎస్‌పురం ఎంపీడీవోగా జి.క్రిష్టయ్య శుక్రవారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆయన డిప్యూటేషన్‌పై ఒంగోలు జెడ్పీ డీపీఆర్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఎన్నికల బదిలీల్లో భాగంగా తిరిగి సీఎస్‌పురం ఎంపీడీవోగా విధులు చేపట్టారు. ఇప్పటివరకు సీహెచ్ రామచంద్రరావు సీఎస్‌పురం ఎంపీడీవోగా విధులు నిర్వర్తించారు.

ఘనంగా గంధ మహోత్సవం



దర్గాలో ప్రత్యేక పూజలు చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: మండలంలోని చిన ఇర్లపాడులో హజరత్ నాగూర్‌మీరా స్వామి 22వ గంధమహోత్సవం శుక్రవారం రాత్రి అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉరుసు సందర్భంగా స్వామివారి దర్గాను విద్యుత్ దీప, పూల అలంకరణలో సుందరంగా తీర్చిదిద్దారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, ఎంపీటీసీ చిట్టిబాబు, ఏఎంసీ డైరెక్టర్ బొట్టు శ్రీను, కౌన్సిలర్ అరుణోదర్, మాజీ వార్డు సభ్యులు సయ్యద్ నాయబ్ రసూల్, చింతలపూడి సాయి, కిరణ్, పండ్ల ఖాదర్, కనమర్ల బాలకృష్ణారెడ్డి, ఖాదర్ బాషా, సమద్, బాజీ, ద్రోణాదుల చెంచులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కుల గణన



చెన్నిపాడులో కుల గణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కల్పన

పొన్నలూరు: గ్రామాల్లో కుల గణన సర్వే పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ కల్పన పేర్కొన్నారు. మండలంలోని చెన్నిపాడు గ్రామంలో జరుగుతున్న కుల గణన సర్వేను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో సామాజిక వర్గాల వారీగా కుల గణన 90 శాతం వరకు పూర్తయిందని చెప్పారు. సర్వే సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ఎలాంటి కుల ధ్రువీకరణ పత్రాలు చూపించాల్సిన అవసరం లేదని, కేవలం వివరాలు మాత్రమే తెలపాలని ప్రజలకు సూచించారు. కుల గణన సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గుత్తి శారమ్మ, పంచాయతీ కార్యదర్శి బేబి, వలంటీర్లు పాల్గొన్నారు.